సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



ఏపీకే ఫైల్.. బీ కేర్ ఫుల్!
సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. అపరిచితులు పంపిన లింక్‌లు, ఏపీకే ఫైల్‌లు ఓపెన్ చేయవద్దని ఎస్పీ సూచించారు. -8లో



కూలిన వంతెన
కడప- బద్వేలు మార్గంలోని అటవీ ప్రాంతంలో సాహెబ్ బావి రహదారికి సమీపంలో కిటికీల వంతెన శనివారం కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.5/22.6
జిల్లాలో శనివారం 22.6 - 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపటి గ్రీవెన్స్‌సెల్ రద్దు
కడప సెవెన్‌రోడ్స్: జెడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో కడప డివిజన్ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ నెల 11 తేదిన జరిగే గ్రీవెన్స్‌సెల్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం)ను రద్దు చేస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు
కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. శనివారం తెల్లవారుజామున పెండిమర్రిలో అత్యధికంగా 63.4 మి.మీ వర్షం కురిసింది.అలాగే మైలవరంలో 42.4, తొండూరులో 35.8 , కడపలో 30.2, సీకేదిన్నెలో 28.8, కమలాపురం, వల్లూరు, చక్రాయపేటలలో 22.4, వేములలో 20.4, జమ్మలమడుగు 19.4, ఎర్రగుంట్లలో 19.2, ఒంటిమిట్టలో 15.4, చెన్నూరులో 14.6, మైదుకూరు 13.6, దువ్వూరు, ఖాజీపేట ,దువ్వూరులో 11.6, అట్లూరులో 11, లింగాలలో 10.2, ముద్దనూరులో 9.2, చాపాడులో 8.4, ప్రొద్దుటూరులో 7, కొండాపురంలో 6.8, వేంపల్లిలో 5.2, పులివెందుల్లో 4 మి.మీ వర్షం కురిసింది.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ
కడప సెవెన్‌రోడ్స్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్ వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ తెలిపారు. శనివారం కలెక్టరేట్లో ప్రిసైడింగ్ అధికారులకు, ఏపీఓలకు బ్యాలెట్ బాక్స్ ల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ వి.విజయలక్ష్మి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి
కడప కోటిరెడ్డిసర్కిల్/సెవెన్‌రోడ్స్: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అందిస్తున్న కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ మేనేజర్ మల్లికార్జునగౌడ్, అధ్యాపకులు ఎస్.శివరామకృష్ణ చౌదరి కోరారు. శనివారం హరిత హోటల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. వివరాల కోసం 97013 43846, 95021 13163 నెంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఇండిపెండెంట్ అభ్యర్థులు వైఎస్సార్‌సీపీ వాళ్లే
సాక్షి టాస్క్‌ఫోర్స్: పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన వాళ్లే ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారని టీడీపీ నాయకుడు బీటెక్ రవి పేర్కొన్నారు. శనివారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కుట్ర పూరిత పనులు వాళ్లు చేస్తూ తర్వాత మా మీద నెపం మోపుతున్నారని అన్నారు. వాళ్లకు వెహికల్ ప్రొవైడ్ చేస్తే వాళ్లే ఆ వెహికల్‌పై వారే దాడి చేసుకోవడం, ఇండిపెండెంట్ అభ్యర్థిపైన దాడి జరిగిందని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసే పనిలో ఉన్నారన్నారు. ఓటర్ల షిఫ్ట్ విషయం నాలుగైదు రోజులు ముందు గుర్తించి ఉంటే ఈ సమస్యకు పరిష్కారం దొరికేదన్నారు.ఇది రాద్ధాంతం చేసే అంశం కాదన్నారు.

మళ్లీ.. అవే మోసాలు!

- నంద్యాల తరహాలో పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక!
- వ్యవస్థలు అడ్డుపెట్టుకుని అడ్డదారులు. మోసపు హామీలు.. ఇప్పుడూ అంతే!
- ఎలాగైనా గెలవాలంటూ కేడర్‌కు బాబు దిశా–నిర్దేశం
- క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న తెలుగుతమ్ముళ్లు



సాక్షి ప్రతినిధి, కడప: సరిగ్గా 8 ఏళ్ల క్రితం జరిగిన నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీడీపీ అధినేతగా.. సీఎంగా చంద్రబాబు లెక్కలేనన్ని కుట్రలు పన్నారు. వ్యవస్థలు అడ్డుపెట్టుకుని అడ్డదారులు తొక్కారు. మోసపు హామీలెన్నో ఇచ్చారు. ఓటర్లకు తాయిలాల ఆశ చూపెట్టారు... వినకుంటే బెదిరించారు. తాజాగా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లోనూ అదే ఫార్ములాను అమలు చేస్తున్నారు. వందలాది మందికి ఉద్యోగ జాయినింగ్ లెటర్లు ఇస్తున్నారు. వేలాది మందికి ఏవేవో ఆఫర్లు ఇస్తున్నారు. అయినప్పటికీ ఇవేవి పనిచేసేలా లేవని ఏకపక్ష పోలింగ్ కోసం చేపట్టాల్సిన చర్యలన్నీ ఎంచుకున్నారు. అదీ కూడా కుదరదంటే ఏకంగా బ్యాలెట్ బాక్సులే మారుస్తామంటూ సవాళ్లు విసురుతున్నారు.

ఓటర్లకు ఆశల ఎర..
పులివెందుల జెడ్పీటీసీ సీటు ఇవ్వండి.. అభివృద్ధి చేస్తామంటూ .. టీడీపీ నేతలు ప్రగల్బాలు పలుకుతున్నారు. ఉద్యోగం కావాలా? జాయినింగ్ లెటర్ రెడీ ఎన్నికల తర్వాత మీ బిడ్డల్ని ఉద్యోగంలో చేర్పించండి. లేదు డబ్బులు కావాలా? గుంపగుత్తగా ఎంతో చెప్పండి ఇస్తాం. అలా కాదంటారా...ఓటుకు వెళ్లొద్దు ఇదో ఇది ఉంచుకోండి. ఇంకా కాదు కూడదంటే బడితె పూజ తప్పదు.. ఇలా పులివెందులలో టీడీపీ నేతలు క్షేత్రస్థాయిలో బరి తెగిస్తున్నారు. కుదిరితే ప్రలోభాలతో.. కాదంటే బెదిరింపులతో ముందుకు సాగుతున్నారు.

వ్యవస్థల అండతో గెలుపే లక్ష్యంగా...
వైఎస్సార్‌సీపీకి చెందిన క్రియాశీలక నేతలందర్నీ కట్టడి చేసే ఎత్తుగడను టీడీపీ ఎంచుకుంది. అందుకు వ్యవస్థలు అనుకూలంగా నిలుస్తున్నాయి. పోలింగ్ జనరల్ ఏజెంటు కూడా క్రియాశీలక నేతకు ఇవ్వకూడదనే దిశగా అడుగులు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి పోలింగ్ జనరల్ ఏజెంటుగా నల్లపురెడ్డిపల్లె బలరామిరెడ్డిని నియమించాల్సిందిగా అభ్యర్థించారు. ఆమేరకు అనెగ్జర్-15, ఫారం-11కు ఒరిజనల్ ఆధార్, ఓటరు కార్డు జత చేశారు. శనివారం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌కు లెటర్ పెట్టుకున్నారు. దీనికి కూడా టీడీపీ నేతల నుంచి క్లియరెన్సు వస్తే తప్ప ఇవ్వమనే దిశగా అధికారులు బాహాటంగా వ్యాఖ్యనిస్తున్నట్లు సమాచారం. దీనిని బట్టి ఇట్టే అర్థం చేసుకోవచ్చు, వ్యవస్థలు అండతో గెలుపే లక్ష్యంగా టీడీపీ అడుగులు వేస్తోంది. వరుస హత్యాయత్నం ఘటనలతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెంచుకున్న నేపథ్యంలో టీడీపీ కేవలం వ్యవస్థల ఆధారంగా పోలింగ్ నిర్వహించుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

నంద్యాల ఎన్నికల వేళ.. బాబు మాటలు.. తాయిలాలు!

- 'మీరు మాకే ఓటు వేయాలి.. గెలిస్తేనే ఇళ్లు కడతాం..'
- కొత్తగా 10 వేల పెన్షన్‌లు కేటాయింపు..
- ముస్లీం మైనార్టీలను దృష్టిలో పెట్టుకొని మహిళకు కుట్టు మిషన్ల పంపిణీ
- 40 వేల మంది డ్వాక్రా మహిళలు అకౌంట్ లలో రూ.4 వేలు చొప్పున డబ్బులు జమ
- 20 మంది మంత్రులు అక్కడే ఉండి రూ.200కోట్లు ఖర్చు చేశారు.
- 'నేనిచ్చిన పెన్షన్ తీసుకొంటూ, నేనిచ్చిన రేషన్ తింటూ నేను వేసిన రోడ్డు మీద తిరుగుతూ నాకు ఓటు వేయకపోతే నేను మాత్రం మీకు ఎందుకు ఇవ్వాలి'అని సీఎం హోదాలో చంద్రబాబు

ఆ రోజు అమలు చేసిన ఫార్ములా లానే పులివెందులలోనూ ప్రయోగించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

దౌర్జన్యం...రౌడీయిజం



అభివృద్ధి చేయకపోగా.. వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి పనులను కూడా అడ్డుకున్న నీచపు నైజం టీడీపీది.. ఆపార్టీ అధినేతది. రూ.530కోట్లతో నిర్మించిన మెడికల్ కళాశాలలో మంజూరైన 50 ఎంబీబీఎస్ సీట్లు కూడా వద్దని చెప్పిన నేపథ్యం. ఇలాంటి పరిస్థితులు తెలుగుదేశం చెప్పుకునేందుకు ఏమి లేకపోవడంతోనే రౌడీయిజం చేస్తూ, దౌర్జన్యాలకు దిగుతున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఓటర్లు ఓటుకు వెళితే వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై పడుతుందనే నమ్మకంతోనే పోలింగ్ కూడా ఏకపక్షంగా చేపట్టాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. అందుకు వ్యవస్థలను సమర్థవంతంగా వాడుకుంటున్నారని పరిశీలకులు భావిస్తున్నారు.

కళ్లముందు కళకళలాడుతున్న అభివృద్ధి

పులివెందులలో అభివృద్ధికి వైఎస్ కుటుంబం చిరునామా అనేది అందరికీ తెలిసిందే. మరోవైపు టీడీపీకి పులివెందులలో నిర్దిష్టమైన అభివృద్ధి చేశామని చెప్పుకునేందుకు ఒక్కటంటే ఒక్కటి లేదు. అదే వైఎస్సార్ సీపీకి కోకొల్లలు. విద్యారంగంలో జేఎన్‌టీయూ, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, నాడు-నేడు స్కూల్స్, ఫుడ్ సైన్స్ కాలేజీ ఏర్పాటును గుర్తు చేస్తున్నారు. ఆరోగ్య రంగంలో వైఎస్సార్ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఉపాధి రంగంలో యూసీఐఎల్, ఆదిత్య బిర్లా ఫ్యాషన్స్, గోవిందరాజా టెక్స్‌టైల్స్, వ్యవసాయ రంగంలో చీని మార్కెట్ యార్డ్, బనానా రీసెర్చ్ సెంటర్, వాటర్ ఇరిగేషన్ ఐజీసీఏఆర్ఎల్ (ఐజీ కార్ల్), డాక్టర్ వైస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ విస్తరింపు.. ఇలా ఎన్నో..ఎన్నెన్నో. ఇక సీటివనరుల గురించి చెప్పుకుంటే గండికోట, మైలవరం ఆధునికీకరణ, పైడిపాలెం, చిత్రావతి విస్తరణ, చిత్రావతి రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాలే తమ అభివృద్ధిని వివరిస్తాయి. రోడ్లు-భవనాలు గురించి బెంగుళూరు - విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే, ఔటర్ రింగ్ రోడ్స్, విలేజ్ కనెక్టివిటీ రోడ్స్, సచివాలయాలు, వరల్డ్ క్లాస్ ఆర్టీసీ బస్టాండ్, క్రికెట్ స్టేడియం, మినీ సెక్రటేరియట్, ఉలిమెల్ల లేక్‌వ్యూ, రాణి తోపు చెప్పకనే చెబుతాయి. వెల్ఫేర్ ఆక్టివిటీస్, 20వేల జగనన్న ఇల్లు ఇలా.. అభివృద్ధి పనుల గురించి ఓటర్లు బహిరంగంగానే చెబుతున్నారు. ఒక్కటంటే ఒక్కటి కూడా అభివృద్ధి చేశామనే స్థితిలో టీడీపీ లేదు. దీంతోనే ఆ పార్టీ వక్రమార్గాలు ఎంచుకున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.



పులివెందుల వైఎస్సార్ మెడికల్ కళాశాల

బాబు మెప్పు కోసమే టీడీపీ నేతల కుట్రలు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ భైరెడ్డి సిద్ధార్థరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ భైరెడ్డి సిద్ధార్థరెడ్డి

పులివెందుల: ఎంతోమందికి వైఎస్సార్ కుటుంబం రాజకీయ భిక్ష పెట్టిందని, పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక ఫలితంతో రాష్ట్రంలో మార్పు ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ భైరెడ్డి సిద్ధార్థరెడ్డి పేర్కొన్నారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలిచి చంద్రబాబు మెప్పు పొందడం కోసం టీడీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పులివెందులలోని భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసలు దాడులు ఎందుకు జరుగుతున్నాయి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులే 'తలకాయలు లేచిపోయేవి కదా'.. అంటూ ఎందుకు మాట్లాడుతున్నారు అని ప్రజలు ఆలోచించాలన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడగొడుతున్నామని, రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుస్తామని చెప్పడం కోసమో...తెలుగుదేశం పార్టీ బాగుందనో ప్రజలను నమ్మించడానికి నానా పాట్లు పడుతున్నారన్నారు. వాళ్లు ఎన్ని చేసినా ప్రజలు వైఎస్ కుటుంబం చేసిన మంచిని మరిచిపోరన్నారు. ఇన్ని రోజులు వైఎస్ కుటుంబం ఈ ప్రాంత ప్రజలకు అండగా నిలబడిందని, ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలబడాల్సిన టైం వచ్చిందని.. కచ్చితంగా బలంగా నిలబడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ జెడ్పీటీసీ ఉప ఎన్నిక పులివెందుల ప్రాంత ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించినదని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికల్లో గెలుస్తామని అవతలి వాళ్లకు అంత నమ్మకం ఉంటే శాంతియుత వాతావరణంలో సీసీ కెమెరాల నీడలో ఎన్నికలను నిర్వహించాలని అధికారులకు విన్నవించాలని కోరారు.

గండి క్షేత్రం.. జనసంద్రం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులతో రద్దీగా మారిన గండి క్షేత్రం

చక్రాయపేట: పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధి భక్తులతో కిక్కిరిసి పోయింది. శ్రావణ మాసం మూడవ శనివారోత్సవం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి సైతం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు భక్తులతో రద్దీగా మారాయి. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని పోలీసులు అద్దాలమర్రి క్రాస్, ఇడుపుల పాయ క్రాస్‌ల వద్దనే వాహణా లను నిలిపి వేశారు. వృద్ధులు, మహిళల కోసం వేంపల్లె ప్రైవేట్ పాఠశాలల వారు ఉచితంగా వ్యాన్‌లు ఏర్పాటు చేశారు. కొందరు వేంపల్లె చక్రాయపేట,నాగలగుట్టపల్లె, వేముల తదితర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సహాయకమీషనర్ వెంకటసుబ్బయ్య చైర్మన్ కావలి కృష్ణతేజ పాలకమండలి సభ్యులతో పాటు,ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య,ఆర్కేవ్యాలీ ఎస్సై రంగారావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది పోలీ సులు బందో బస్తు నిర్వహించారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, అర్చకులు కేసరి,రాజారమేష్, అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఏర్పాట్లలో విఫలం.. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ తగు ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరిగింది. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ వర్గాలకు సంబంధించి వచ్చిన బంధు మిత్రులకే ఇక్కడ రాచ బాటలు ఉన్నాయని విధులకు వచ్చిన వారికి అవమానాలే దక్కుతున్నాయని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు

వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం

- కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ధీమా
- ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డితో కలిసి ప్రచారం
- అడుగడుగునా స్వాగతం పలుకుతూ రాఖీలు కట్టిన మహిళలు

పులివెందుల/వేంపల్లె: పులివెందుల మండల జెడ్పీటీసీ మరోసారి వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం పులివెందుల మండల పరిధిలోని నల్లగొండువారిపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, వైఎస్ మనోహర్ రెడ్డిలతో కలిసి నల్లగొండువారిపల్లె గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పులివెందుల మండల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా తుమ్మల హేమంత్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ముందుగా ఆ గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో మహిళలు రక్షా బంధన్ సందర్భంగా ఎంపీని అన్నగా భావించి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అడుగడుగునా బాణాసంచా పేల్చుతూ గ్రామస్తులు స్వాగతం పలికారు. ప్రచారానికి విచ్చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులకు విశేష ఆదరణ లభించింది.



నల్లగొండువారిపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి, పార్టీ నేతలు

మోసం చేసిన కూటమి ప్రభుత్వం
ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితం అని చెప్పి అరకొర మందికి ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చి మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి ఒకేసారి రూ 20 వేలు ఇస్తామని చెప్పి మాట మార్చిందన్నారు.

గ్రామ ప్రజలు ఏమన్నారంటే...
ఎన్నికల ప్రచారంలో తమ ఊరిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పక్క గ్రామానికి తరలించారని ఎంపీ దృష్టికి పలువురు గ్రామస్తులు తీసుకొచ్చారు. ఈ జెడ్పీటీసీ ఎన్నికలు సజావుగా నిర్వహిస్తే ఎక్కడ కూటమి నేతలు ఓడిపోతారేమోనని వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేస్తూ.. భయభ్రాంతులకు గురి చేస్తున్నారని గ్రామ ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పోలింగ్ బూత్ ను తమ గ్రామంలోని ఏర్పాట్లు చేయించేటట్లు అధికారులతో మాట్లాడాలని కోరారు. అధికార పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలను, దాడులను పోలీసులు, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇలాంటి దుర్మార్గాలను చేస్తున్న టీడీపీ నాయకులకు బుద్ధి వచ్చేలా వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపిస్తామని ఆ గ్రామ ప్రజలు భరోసా ఇచ్చారు. ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్ రెడ్డి

ఎన్ని కుట్రలు చేసినా విజయం వైఎస్సార్‌సీపీదే

ఒంటిమిట్ట: తెలుగుదేశం పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్ని కుట్రలు చేసినా ఈ నెల 12న జరగబోయే జెడ్పీటీసీ ఉప ఎన్నికలో విజయం సాధించేది వైఎస్సార్‌సీపీయేనని వైఎస్సార్‌సీపీ కీలక నేతలు ధీమా వ్యక్తం చేశారు. .శనివారం మండల పరిధిలోని మంటపంపల్లి, రామచంద్రాపురం, అచ్చంపేట, ఎస్టీ కాలనీ, పెన్నపేరూరు గ్రామాల్లో అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో కలిసి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కడప పార్లమెంట్ పరిశీలకులు అజయ్ రెడ్డి ప్రచారం నిర్వహించారు.ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అభ్యర్థి ఇరగంరెడ్డి సు బ్బారెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

- రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ..ఒంటిమిట్ట, పులివెందుల అభ్యర్థులను గెలిపించి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా అందిస్తామన్నారు.
- రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు సాధ్యం కాని హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ప్రజలను నమ్మించి మోసం చేయడమే అని అన్నారు.
- వైఎస్సార్‌సీపీ కడప జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ..పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికను ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే తీసుకొచ్చారని, కేవలం 8 నెలలు ఉన్న ఈ పదవికి ప్రభుత్వం ఇన్ని కోట్లు ఖర్చు చేయడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటో తెలియడం లేదన్నారు.
- ఓటర్లను కూటమి ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు.
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ..ముస్లిం, మైనారిటీలకు మేలు చేసింది ఎవరంటే దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్ అన్నారు. ఇంతటి మేలు చేసిన వారికి మద్దతుగా జెడ్పీటీసీ ఉప ఎన్నికలో సుబ్బారెడ్డి ని గెలిపించాలని కోరారు.
- రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..కుప్పంలో గత జెడ్పీటీసీ ఎన్నికల్లో వంద శాతం వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడంతో సీఎం చంద్రబాబు అవమానాన్ని భరించలేక వైఎస్ జగన్ ఇలాక అయిన కడప జిల్లాలో వైఎస్సార్‌సీపీ ని ఓడించి జగన్‌ను అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశంతో ఉప ఎన్నికను నిర్వహిస్తున్నారన్నారు.
- మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ..సీఎం చంద్రబాబు మహిళలను నిలువునా మోసం చేశారన్నారు. కడప పార్లమెంట్ పరిశీలకులు అజయ్ రెడ్డి మాట్లాడారు.



ఓటును అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ కడప జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, అంజద్ బాషా

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



కడప కోటిరెడ్డిసర్కిల్ : రిమ్స్ మార్చురీలో గుర్తుతెలియని మృతదేహాన్ని ఉంచారు. సంబంధీకులు తగిన ఆధారాలతో వచ్చి తీసుకెళ్లవచ్చని రిమ్స్ అధికారులు తెలిపారు. గత నెల 14వ తేదీ మృతుడు రిమ్స్‌కు వచ్చాడని, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడన్నారు.

ఏపీకే ఫైల్.. బీ కేర్ ఫుల్!

- ఏపీకే ఫైల్స్ పేరుతో సైబర్ మోసాలు
- లింకులను క్లిక్, డౌన్‌లోడ్ చేస్తే వెంటనే వాట్సాప్ హ్యాక్
- అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవలి కాలంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింక్‌లు, డాక్యుమెంట్లు, ఏపీకే ఫైల్‌లు ఓపెన్ చేయవద్దని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ సూచించారు. ఈ మేరకు ఎస్పీ ప్రకటన విడుదల చేశారు. ఏపీకే (ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ ఫైల్స్) ద్వారా ప్రజల ఫోన్‌లను హ్యాక్ చేసి వారి వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ డేటా, ఫొటోలు, డాక్యుమెంట్లను దొంగలిస్తూ, ఆర్థిక నష్టానికి గురిచేస్తున్నారన్నారు.

మోసం చేసే విధానం..

- నిందితులు వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, మెసెంజర్, ఇన్‌స్టాగామ్ ద్వారా ఒక లింక్ పంపుతారు.
- డెలివరీ బాయ్, రీఫండ్ లింక్, డిజిటల్ కేవైసీ, ఎస్‌బీఐ, రివార్డ్స్ అప్‌డేట్, ఫ్రీ గిఫ్ట్, అర్జెంట్ డాక్యుమెంట్, ఈ-చలానా, పీఎం కిసాన్ వంటి పేర్లు గల లింక్‌తో వినియోగదారులను ఆకర్షిస్తారు.
- ఆ లింక్ ద్వారా ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ అవుతుంది. వినియోగదారుడు దాన్ని యాప్ అనుకుని ఇన్‌స్టాల్ చేస్తాడు.
- ఆ యాప్ పర్మిషన్స్ (అనుమతులు) అడుగుతుంది. ఎస్ఎంఎస్, కాంటాక్ట్స్, కాల్ లాగ్స్, స్టోరేజ్, నోటిఫికేషన్స్, అసెస్‌బులిటీ తదితరాలు అనుమతులు ఇచ్చిన వెంటనే ఫోన్ పూర్తిగా సైబర్ నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్తుంది.
- ఫోన్‌లోని ఓటీపీలు, బ్యాంక్ ఖాతా వివరాలు, క్రెడిట్/డెబిట్ కార్డ్ సమాచారం నేరుగా నిందితులకు అందుతుంది.
- కొన్నిసార్లు యూపీఐ యాప్‌లను కూడా నేరుగా యాక్సెస్ చేసి ఖాతాలోని డబ్బును దొంగిలిస్తారు.
- అదనంగా, కొన్ని సందర్భాల్లో ఫోన్ కెమెరా, మైక్ యాక్సెస్ చేసి వ్యక్తిగత వీడియోలు, ఆడియోలు సేకరించి బ్లాక్‌మెయిల్‌కు కూడా ప్రయత్నిస్తున్నారు.



ఏపీకే ఫైల్స్

అమాయకులే లక్ష్యం

అంగవైకల్యం ఉన్నవారు, వృద్ధులు, ఆన్‌లైన్ షాపింగ్ చేసే వినియోగదారులు, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

- ప్లే స్టోర్ తప్ప మరో వేదికల నుంచి ఏ యాప్‌ను డౌన్లోడ్ చేయకండి.
- గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింక్‌లు, డాక్యుమెంట్లు, ఏపీకే ఫైల్‌లు ఓపెన్ చేయవద్దు.
- ఫోన్‌లోని ప్రతి యాప్‌కు ఇచ్చే అనుమతులను అప్రమత్తంగా పరిశీలించాలి.
- బ్యాంక్ అకౌంట్, యూపీఐ కార్డు వివరాలను ఎవరితోనూ పంచుకోరాదు.
- మీరు ఫోన్‌లో అనుమానాస్పద యాప్ ఇన్‌స్టాల్ చేసినట్లయితే వెంటనే ఆ యాప్‌ను అన్ ఇన్‌స్టాల్ చేయండి.
- మొబైల్‌ను రీసెట్ చేసి ట్రస్ట్ చేసిన యాప్‌లను మాత్రమే తిరిగి ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫోన్‌లో భద్రతాపరమైన భరోసా ఇచ్చే యాప్ (యాంటీ వైరస్/యాంటీ మాల్వేర్) ఉపయోగించాలి
- బ్యాంకింగ్ అప్లికేషన్లలో బయోమెట్రిక్/2-ఫ్యాక్టర్ అథెంటికేషన్ వాడాలి.

మోసానికి గురైతే..

- తక్షణం 1930 నంబర్‌కు కాల్ చేయాలి (నేషనల్ సైబర్ హెల్ప్‌లైన్)
- డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి.
- మీ దగ్గరలో గల పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి.
- ప్రజలందరూ సైబర్ నేరాలపై అవగాహనతో ఉండాలి. నేటి మోసాలు ఆధునిక పద్ధతుల్లో జరుగుతున్నాయి. వాటిని గుర్తించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలి.
- సైబర్ భద్రత జాగ్రత్తలు పాటించి మోసాల నుంచి దూరంగా ఉండాలి.
- ఏపీకే ఫైల్స్‌ను క్లిక్ చేసినట్లయితే వెంటనే మీ వాట్సాప్‌ను కూడా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారు.
- మీరు ఏపీకే ఫైల్స్ లింకును క్లిక్ చేసిన వెంటనే ఆ లింకు మీరు ఉన్న అన్ని గ్రూపులలో కూడా ఫార్వర్డ్ అవుతుంది.
- ఏపీకే ఫైల్స్ లింకులను క్లిక్ చేయకూడదని సూచిస్తున్నాం.

బ్రహ్మంసాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల



నీరు విడుదల అనంతరం ఎస్ఈని సన్మానిస్తున్న ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ నుంచి శనివారం తెలుగుగంగ ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటరామయ్య ఎడమ కాలువకు 200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సాగర్‌లోకి 1350 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. ప్రస్తుతం 6 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీరు వస్తుందన్నారు. రైతులు సాగు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి, జోగయ్య, నరసింహులు, సాంబశివారెడ్డి, నారాయణ యాదవ్, శివయ్య యాదవ్, డీఈఈ మురళీమోహన్, ఏఈఈ మద్దం నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కడప– బద్వేలు మార్గంలో కూలిన వంతెన



అటవీ ప్రాంతంలో కూలిపోయిన కిటికీల వంతెన



అప్రోచ్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్

సిద్దవటం : కడప– బద్వేలు మార్గంలోని అటవీ ప్రాంతంలో సాహెబ్ బావి రహదారికి సమీపంలో కిటికీల వంతెన శనివారం కూలిపోయంది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించి పోయాయి. ఈ రహదారి గుండా నెల్లూరు, బద్వేలు కలువాయి, పోరుమామిళ్ల తదితర ప్రాంతాలకు ప్రయాణికులు వెళుతుంటారు. 1983లో ఈ వంతెన నిర్మించారు. శనివారం అధిక లోడుతో వాహనాలు ప్రయాణించడంతో వంతెన కూలిపోయిందని ద్విచక్ర వాహనదారులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ సిబ్బందిని సంఘటన స్థలానికి పంపి ప్రయాణికులు ఎవరినీ రోడ్డు దాటనీయకుండా చర్యలు చేపట్టారు. అధికారులు రెండు జేసీబీ యంత్రాలతో వంతెన పక్కనే అప్రోచ్ రోడ్డుకు చర్యలు చేపట్టారు. ఈ పనులను బద్వేలు ఆర్డీఓ చంద్ర మోహన్ పరిశీలించారు. అనంతరం సాయంత్రానికి ఈ మార్గంలో వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.

విద్యా సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్/రూరల్ : రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాల దోపిడీకి అడ్డుకట్ట వేసి తక్షణమే విద్యాహక్కు చట్టం అమలు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడెం రెడ్డిబాబు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో విద్యా హక్కు చట్టం అమలు చేస్తారా? లేదా? అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల్లోకి బీసీ, ప్రజా, విద్యార్థి సంఘాలు అనుమతి లేకుండా ప్రవేశించరాదని జీఓ జారీ చేయడం దారుణమన్నారు. ఈ జీఓ కారణంగా ఆయా విద్యా సంస్థల యాజమాన్యాల అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డిబాబు

ముదిరాజ్ కులస్తులు చైతన్యవంతులు కావాలి

రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులు చైతన్యవంతులై తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని ఆంధ్ర ప్రదేశ్ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడెం రెడ్డిబాబు పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ముదిరాజ్ సంక్షేమ సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శివశంకర్, ఉపాధ్యక్షులుగా మణికుమార్, వివేకానంద, ప్రధాన కార్యదర్శిగా సునీల్, కార్యదర్శిగా నరసింహులుతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ముదిరాజ్‌లను ప్రస్తుతం ఉన్న బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ముదిరాజ్ సామాజిక వర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఒరిగి ఇద్దరు కూలీలు దుర్మరణం



మృతిచెందిన మజీహిసింగ్, గలగసింగ్

చిన్నమండెం : ట్రాక్టర్ ఒరగడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు కూలీలు దుర్మరణం చెందిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఒరిస్సా రాష్టానికి చెందిన మజీహీసింగ్(23), గలగసింగ్(20), లక్ష్మణ్‌సింగ్‌లు చిన్నమండెం-పెద్దమండ్యం జాతీయ రహదారిలో హైవోల్టేజీ విద్యుత్ లైన్ పనులు చేస్తున్నారు. పనులు ముగించుకొని ట్రాక్టర్‌లో చిన్నమండెంకు వస్తుండగా పడమటికోన గ్రామం తొగటపల్లె సమీపంలో ట్రాక్టర్ పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో మజీహీసింగ్(23), గలగసింగ్(20) అక్కడికక్కడే మృతి చెందారు. లక్ష్మణ్‌సింగ్‌కు గాయాలయ్యాయి. మృతదేహాలను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



సిద్దవటం : కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలం భాకరాపేట వద్ద శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన పడిఉన్న గుర్తు తెలియని వృద్ధురాలిని కడప రిమ్స్‌లో చేర్పించామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఆమె వివరాలు తెలిసిన వారు ఒంటిమిట్ట సీఐ బాబు, 9121100581, సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ 9121100584 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రమాదంలో గాయపడి.. కోలుకోలేక..



శాంతమ్మ (ఫైల్)

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వివరాలు... స్థానిక మండల కేంద్రం ఇందిరా కాలనీకి చెందిన వెంకటరమణ, భార్య శాంతమ్మలు కలిసి గత గురువారం ద్విచక్రవాహనంలో పనుల మీద మదనపల్లెకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలో వేపూరికోట వద్ద శాంతమ్మ చీర బైక్ చక్రానికి చుట్టుకొని కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడడంతో 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గాలివీడు : మండలంలోని కొర్లకుంట పంచాయతీ పెద్దరెడ్డివారిపల్లెకు చెందిన నిర్జి శంకరయ్య (38) అనే వ్యక్తి అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు.. మృతుడు రజక వృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. వారిని పోషించడంలో అప్పులు ఎక్కువ చేశాడు. వాటిని తీర్చుకోలేక గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వివాహిత..

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని సూర్య నగర్‌లో నివాసముంటున్న విద్యుత్ శాఖ ఏఈ యోగానంద్ భార్య చిన్న రెడ్డెమ్మ (40) శనివారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఈమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. మానసిక స్థితి బాగాలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్పీకి రాఖీ కట్టిన ఓం శాంతి అక్కయ్యలు



కడప కోటిరెడ్డిసర్కిల్ : రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు ఓం శాంతి సంస్థ ప్రతినిధులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు శాంతి సాధనకు తాము నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఓం శాంతి సంస్థ ప్రతినిధులు బ్రహ్మకుమారి గీతా అక్కయ్య, సుశీల అక్కయ్య, ఈశ్వరీ అక్కయ్య, ప్రదీప అక్కయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ



కడప నగరంలో ప్రైవేట్ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్

కడప రూరల్ : జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్ కడప నగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వెస్ట్, పొల్యూషన్, ధరల పట్టిక, నీటి వసతి, పరిశుభ్రత తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే అర్హత కలిగిన సిబ్బంది గురించి ఆరా తీశారు. నిబంధనలను అతిక్రమించిన ఆసుపత్రులపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈఓ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జూటూరు డిజిటల్‌లో ఆఫర్లు



వినియోగదారులకు ఆఫర్లను వివరిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు : శ్రావణ మాసం పురస్కరించుకుని జూటూరు డిజిటల్ షోరూంలలో ఆఫర్లను ప్రకటించినట్లు సంస్థ యజమాని జూటూరు మధుసూదన్ రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం, ఆదివారం ప్రొద్దుటూరు, కడప, బద్వేలు, రైల్వేకోడూరు ప్రాంతాల్లోని జూటూరు డిజిటల్ షోరూంలలో డిస్కౌంట్ ధరలలో ఎలక్ట్రానిక్ పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. టీవీ, ఫ్రిడ్జ్, ఏసీ, హోమ్, కిచెన్ అప్లెన్స్‌తోపాటు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులపై 50 శాతం వరకు తగ్గింపు ధరలను అందిస్తున్నట్టు తెలిపారు. జీరో శాతంతో వడ్డీ రుణ సౌకర్యం, క్రెడిట్ కార్డుపై 10 శాతం డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు

ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన గండ్లూరు పుల్లయ్య

వేంపల్లె : మండలంలోని కత్తులూరు క్రాస్ వద్ద ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న గండ్లూరు పుల్లయ్య (55) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువులు ఇచ్చిన వివరాల మేరకు.. మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామానికి చెందిన మెకానిక్ వలీ శ్రావణ మాసం మూడవ శనివారం సందర్భంగా గండి క్షేత్రానికి తన సొంత ఆటోలో కుటుంబ సమేతంగా బయలుదేరాడు. కత్తులూరు క్రాస్ వద్దకు ఆటో రాగానే రాజంపేటకు చెందిన వెంకటరమణ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కారులో పులివెందుల నుంచి రాజంపేటకు వెళుతూ ముందు వెళుతున్న ఆటోను ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. దీంతో ఆటో సమీపంలో ఉన్న చెట్టును ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న వారు కింద పడ్డారు. గండ్లూరు పుల్లయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే డ్రైవింగ్ చేస్తున్న వలీ, చిన్నారులైన సయాన్, మెహిరున్, వలిమాలకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. ఈ సంఘటనను చూసిన స్థానికులు 108 వాహనం ద్వారా హుటాహుటిన వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్ర గాయాలైన సయాన్, మెహిరున్, వలిమాలను మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. రోడ్డు ప్రమాదంలో గండ్లూరు పుల్లయ్య మృతి చెందడంతో వేంపల్లె ప్రభుత్వాసుపత్రి వద్దకు టి.వెలమవారిపల్లె ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చారు. బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ స్థలాన్ని లూలూ షాపింగ్ మాల్‌కు ఇవ్వడం తగదు

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విజయవాడ నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ గవర్నరుపేట 1-2 డిపోలకు, పాత బస్టాండుకు సంబంధించిన నాలుగు వందల కోట్ల రూపాయల విలువ గల 4.15 ఎకరాల స్థలాన్ని లూలూ షాపింగ్ మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టడం దారుణమని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోసుబాబు, రామ్మూర్తి పేర్కొన్నారు. శనివారం కడపలోని అసోసియేషన్ జోనల్ కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ రెండు డిపోలలో 200 బస్సులతో పాటు 1100 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. ఆర్టీసీని ప్రజలకు దూరం చేస్తూ ఓ పారిశ్రామికవేత్తకు జీఓ నంబర్. 137 ద్వారా కట్టబెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. గవర్నరుపేట డిపోలకు 1, 2, పాత బస్టాండ్ స్థలాన్ని 1959లో గజం రూ. 16 చొప్పున సుమారు నాలుగు లక్షల ఆరు వేల రూపాయలకు ప్రభుత్వం కేటాయించిన రేటుకు ఆర్టీసీ యాజమాన్యం కొనుగోలు చేసిందన్నారు. ఇలాంటి విలువైన స్థలాన్ని వ్యాపార వేత్తలకు ధారాదత్తం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యం.మల్లికార్జున, కడప డిపో అధ్యక్షుడు ఈ.రాము, వర్కింగ్ ప్రెసిడెంట్ విల్సన్, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధనుడు, పీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో 47 గొర్రెలు మృతి

తంబళ్లపల్లె : పిడుగుపాటుతో 47 గొర్రెలు మృతి చెందిన విషాద సంఘటన శనివారం మండలంలో జరిగింది. మండలంలోని ఆర్ఎన్ తాండా పంచాయతీ బోనాసువారిపల్లెకు చెందిన రెడ్డమ్మ బంగారు తాకట్టు పెట్టి, పలువురు రైతుల వద్ద అప్పులు చేసి గొర్రెలు కొని వాటితో జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి గొర్రెలను షెడ్డులో తోలింది. వర్షం వల్ల పడిన పిడుగు తాకిడికి 47 గొర్రెలు మృతి చెందాయి. శనివారం ఉదయం గొర్రెలు బయట తోలేందుకు వెళ్లగా ఒక్కసారిగా గొర్రెలు మృతి చెందడం చూసి బోరున విలపిస్తూ కుప్పకూలింది. సమాచారం అందుకున్న పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర, పశువైద్యులు డాక్టర్ విక్రమ్‌రెడ్డి, ఇందులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. పిడుగుపాటుకే మృతి చెందినట్లు నిర్ధారించారు. మరో ఆరు గొర్రెలు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా చికిత్స చేశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గ్రామానికి వెళ్లి బాధితులను ఓదార్చి పరామర్శించారు. రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, నాయకులు సురేంద్రనాథ్, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొండయ్య తదితరులు ఉన్నారు.